కవితా కౌముది

# వ్యత్యాసం

గాయత్రి భోగవల్లి

బాహ్య దృష్టితో
సున్నిత హృదయుడు
నిశ్శబ్దపు శబ్దం విన్నాడు,
అంతర్దృష్టితో
జ్ఞాని
శబ్దంలోని నిశ్శబ్దంలో
లయించాడు..!

బాహ్య దృష్టితో
చిత్రకారుడు
తెలుపులోని రంగులను చిలికిదీసి రచించాడు,
అంతర్దృష్టితో
జ్ఞాని
రంగులన్నీ పుట్టిన స్వచ్ఛతలో
వెలిగిపోయాడు..!

బాహ్య దృష్టితో
కళాకారుడు
నైరూప్యంలో రూపాలు
చూశాడు,
అంతర్దృష్టితో
జ్ఞాని
అన్ని రూపాల వెనుక
ఏకరూపం దర్శించాడు..!

బాహ్య దృష్టితో
మనస్తత్వవేత్త
మనసును విప్పి దాని రహస్యం చూడగోరాడు,
అంతర్దృష్టితో
జ్ఞాని
మనసును దాటిన ఆత్మలో
చిదంబర రహస్యం
కనుగొన్నాడు..!

బాహ్య దృష్టితో
లౌకికుడు
సంసార సాగరంలో
దుఃఖంలేని సంతోషం కోసం
తీవ్ర మథనంలో
అలసిపోతున్నాడు,
అంతర్దృష్టితో
జ్ఞాని
చిత్సాగరంపై తేలియాడే
బ్రహ్మానందం
తానైనాడు..!!

★★★

## ఉన్నట్టుండి

శిష్ట్లా వి ఎల్ ఎస్ శర్మ

ఉన్నట్టుండి.....!
మనిషి..... ప్రక్కనున్న
చెట్టులాగనో
పిట్టలాగనో మారిపోతే
ఎంత బాగుంటుంది!
అన్నట్టు....గుర్తుకొచ్చింది
చెట్టనంగానే
ఎన్ని తరాల అనుభవం!
పిట్టనంగానే
ఎంతటి అన్వేషణ!
విత్తు మొలకెత్తి
ఇంతటి వృక్షమయ్యేదాకా
ఎన్ని అనుభవాలు!
ఎండకు వాడి
వానకు తడిసి
చలికి వణికి
ఆ పిట్టకు....
వెచ్చటి గూడు కట్టుకోటానికి....!
ఎన్ని అనుభూతులు....!
తుఫానులకు సుడిగాలులకు
తాను చలించిపోతున్నా
గూటిని చెదరనివ్వదు....
అది పిట్ట పనితనమా!
చెట్టు ఔన్నత్యమా!
అందుకే
చెట్టన్నా..పిట్టన్నా నాకిష్టం....
వున్నట్టుండి....
అలా ఐపోతే! ★★★

## వీడని నీడ

భరత్ ఋషి

సమూహంలో ఒంటరిని నేను
నా తోడై ఉంటానంటావెందుకు
అనంత విశ్వంలో అర్థం లేని శూన్యాన్ని నేను
నాలో కలిసిపోతానంటావెందుకు
సమస్యలే తోడుగా బతుకుతున్న
నాతో కలిసుండాలనే పిచ్చితనం నీకెందుకు
ఏనాడో ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకున్న నాలో
నమ్మకాన్ని నింపాలని విశ్వప్రయత్నం చేస్తావెందుకు?
భూమిని తాకాలని ఆరాటపడే వర్షపు చినుకల్లే
నాకు దగ్గరవ్వాలని తపించిపోతావెందుకు?
గమ్యం నిశ్చయించుకోని నావికున్ని నేను
గుడ్డిగా నాతో వచ్చేందుకు సిద్ధపడతావెందుకు?
సాదాసీదా కుర్రాణ్ణి నేను
నాలో సగమైపోయేంత ప్రేమెందుకు?
జీవిత పోరాటంలో గెలుస్తానో, ఓడతానో
నాతో భాగం పంచుకోవాలనే వెర్రి ఆశ నీకెందుకు?
దూరం నుండి ఆరాధిస్తూ
దగ్గరుండి నా కోపాన్ని భరిస్తూ
నీపై కొంచెం ప్రేమ చూపిస్తే చాలంటూ
వదిలిపోని నీడలా వెంటపడతావెందుకు..!

★★★

# నిక్కమైన నీలమొక్కటి

అయ్యగారి లక్ష్మణరావు

అలనాడు ఆసువుగ ఇల రాజ అడిగేను
అలసాని పెద్దన్న అలవోకగా నుడివె
గుండెలో ఉబికెను నిండైన రసభూతి
మండలాధిపతి వేసె పండితులు హర్షించ
పాండితీ వరునికి గండ పెండేరము

ఆరీతి వర్ణించ ఆ కైత చాతురి
యే రాత వారికి చేత కాబోదు
ఈరీతి వివరింతు నేనెంచు అర్హతలు
సరైన కవితకి వినయతతో నేను

పదాలు అందమై
పాదరస చందమై
పెదవి పై తేలుతూ
పదనిసలు పా డాలి

గల గలా చదివితే
కిల కిలా రావ మై
కిత కితలు కలిగించి
వెతలు మరిపించి
మతిని మురిపించాలి

కలువ కన్నుల భామ
మిల మిలల
వలువలతో
తలవొంచి తొణకని

తొలి రేయి రాణి లా
పలు రీతి కవ్వించు
జాతిరిని జాణ లా
ఉల్లాస భరితమై,
యేరీతి కారీతి
పలు రీతి మెప్పించు
అనుభూతి నివ్వాలి

తెలుసుకోవాలనే
తెలివి గల వారికి
విలువలని తెలిపే
విలువగల రాతగా

భావార్థ గంభీర
కుంభమై వర్ధిల్లు
శబ్ద సుందరమైన
లబ్ధి గల రాతగా

కల కాల ముండాలి
ఇల లోన నిండాలి

వలపులకి ప్రతి బింబమై
తలపులకి తొలికిరణమై,
విలువలకి పై చరణమై!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏల హృదయమ్ము నేడు స్తంభించెనిట్లు?
పలుకులొలుకవు రెండైన కలమునుండి
వెలికి రాదొక్క స్వరమైన గళమునుండి
రాగమన్నది హృదినుండి రాలెనేమొ?

ఎన్నొ వర్షమ్ములెద నెలకొన్న స్మృతులు
బంధములు కోరికలు రాగవల్లులన్ని
కరగిపోవుచున్నవిదేమి కనుల ముందు?
మనసు రససిద్ధి యన్నది మరచెనేమి?

కాలగమనమ్ము దీనికి కారణమ్మొ!
చేరువను లేని బంధముల్ కారణమ్మొ!
తలకు మించిన భారముల్ తాకెనేమొ!
కొలది కొలదిగ సత్వమ్ము క్రుంగెనేమొ!

శైశవానందపూరితజ్ఞాపకములు
చేరి ముదమును గొల్పు మస్తిష్కమందు
తరుణదశలోని ప్రణయతత్వమ్ములన్ని
మేలుకొని వచ్చి నిలుచు నా స్మృతిపథాన

కనుల ముందర గతమెల్ల కదలియాడు
వర్తమానము రసహీనపాత్ర యౌను
అంతు పట్టనిది భవిష్యదర్థమెపుడు
ఈ సుదీర్ఘయానమ్మునకేమి ఫలము?

COMMENTS